క్లుప్తంగా

ఉత్తమ సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న అంజయ్య

కందుకూరు: 2022–23 ఏడాదిలో లయన్స్‌క్లబ్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా తాళ్ల అంజయ్యను లయన్స్‌క్లబ్ ఉత్తమ రీజియన్ అవార్డు వరించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గవర్నర్ రఘు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ వీజీడీలు హరినారాయణ భట్టడ్, కోటేశ్వరరావు, డాక్టర్ గడ్డం మహేంద్రకుమార్‌రెడ్డి, జోన్ చైర్మన్లు రాంరెడ్డి, సత్యనారాయణ, మురళీమనోహర్, కందుకూరు అధ్యక్షుడు బీఆర్ రాంరెడ్డి, సభ్యులు చెన్నకిషన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి అంజయ్యకు అభినందనలు తెలిపారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్



మేకపోతుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కందుకూరు: సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో 31 రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మేకపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాలరాజ్ మాట్లాడుతూ.. వివిధ రూపాల్లో కార్మికులు సమ్మె చేస్తున్నా నేటికీ ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, దశరథ, ప్రవీణ్, పంచాయతీ కార్మికులు జంగయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యువతకు సమన్యాయం



ఇంటింటి ప్రచారంలో యూత్ కాంగ్రెస్ నేతలు

కందుకూరు: కందుకూరు మండల పరిధి బేగంపేటలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహచారి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే యువతకు సమన్యాయం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు బలరామ్, జ్ఞానేశ్వర్, శ్రీను, శ్రీకాంత్, శ్రీనివాస్, జంగయ్య, పృథ్వీ, జంగయ్య, వంశీ, రామకృష్ణ, నరేష్, పెద్ద ఐలయ్య, మల్లేశ్, ఊటు రాజు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

కందుకూరు: నూతన తహసీల్దార్ గోపాల్‌ను శనివారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు లచ్చానాయక్, శేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, రామకృష్ణ, విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకోకుండా బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ అన్నారు. శుక్రవారం శ్రీరాం కాలనీలో బీజేపీ నేత అందెల శ్రీరాములు యాదవ్ పర్యటించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం శ్రీరాం కాలనీ ఎలా ఉందో, ఇప్పుడెలా ఉందో గ్రహించాలన్నారు. మంత్రి సబితారెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీకి చెందిన నాయకుడు ఎంపీటీసీగా ఉండి శ్రీరాం కాలనీకి ఏం చేశాడో తెలుసుకోవాలని సూచించారు.

విద్యార్థికి చేయూత

తలకొండపల్లి: నిరుపేద విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. పెద్దూర్‌తండాకు చెందిన కేతావత్ నవీన్ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు. ఇటీవల నవీన్ తండ్రి మృతి చెందగా.. శనివారం రఘునాయక్ ద్వారా నవీన్‌కు రూ.10 వేలు సహాయం చేశారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- వాడిన వస్తువులను ఆర్ఆర్ఆర్‌కు అందజేయాలి
- మేయర్ దుర్గ, కమిషనర్ వాణి
- పాత సామగ్రి సేకరించిన మేయర్



పాత సామగ్రిని సేకరిస్తున్న మేయర్ దుర్గ, కమిషనర్ వాణి

మీర్‌పేట: 'ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం. మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, ఆరోగ్యంగా జీవిద్దాం' అని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్ చెప్పారు. శనివారం 15వ డివిజన్ దీన్‌దయాళ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద రీ–థింక్ కార్యక్రమంలో భాగంగా ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. కమిషనర్ అల్లూరి వాణితో కలిసి ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దామని, ప్లాస్టిక్‌తో పాటు వాడిన ఇతర వస్తువులను ఇంట్లో ఉంచకుండా (ఆర్ఆర్ఆర్) రెడ్యూస్ రీసైకిల్ రీయూస్ సెంటర్‌కు అందజేయాలని సూచించారు.

ఇళ్లలో ఉంచరాదు

తడి,పొడి సంబంధిత వస్తువులైన పుస్తకాలు, అట్ట ముక్కలు, వాడిన ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తులు, ప్లాస్టిక్, చెప్పులు వంటి ఇతర వస్తువులను ఇళ్లలో ఉంచరాదని చెప్పారు. మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన మన వార్డుని అందంగా తీర్చిదిద్దుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం స్థానికుల నుంచి 10 కిలోల అట్టముక్కలు, 100 కిలోల బట్టలను సేకరించారు. పర్యావరణ ఇంజినీర్ రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, వార్డు అధికారులు నరసింహ, కృష్ణ, మెప్మా ఇన్‌చార్జి లక్ష్మయ్య, సుగుణ, రంజిత్ పాల్గొన్నారు.

న్యాయం జరిగేవరకు పోరాటం

దళితులకు భూములిస్తామన్న సీఎం కేసీఆర్

- వారి భూములు గుంజుకుంటున్న మంత్రి సబితారెడ్డి
- కాంగ్రెస్ నేతల మండిపాటు



బాధితులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామంటుంటే.. మంత్రి సబితారెడ్డి వారి భూములను లాక్కుంటుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మా భూమి మాగ్గావలే అని నిరసనలు తెలుపుతున్న బడంగ్‌పేట దావుత్‌ఖాన్‌గూడ దళిత కుటుంబాలను శనివారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. సర్వే నంబర్ 2లో దళితులు సాగుచేసుకుంటున్న భూములను పరిశీలించి మాట్లాడారు. పేద దళిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, టీపీసీసీ ఉపాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు జంగారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు వంగేటి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

కబ్జాదారులకు ప్రోత్సాహం

సర్వేనెనంబర్ 2లోని 40 ఎకరాలను 1955 నుంచి దళితులు సాగుచేసుకుంటున్నారని, సాగుచేసిన రైతులను విడిచిపెట్టి కబ్జాదారులను పోత్సహిస్తున్న మంత్రి సబితారెడ్డిని వెంటనే భర్తరఫ్ చేయాలని నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి పారిజాత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో ఇదే భూ నిర్వాసితులకు పట్టాలు పంచిపెట్టిందని గుర్తు చేశారు. ఇంకా ఎంతమంది భూ నిర్వాసితులు, ఇళ్లు లేని ఉన్నారో గుర్తించి వారికి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే పోరాటం చేస్తామన్నారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, సంతోషి, కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు ఉన్నారు.

నేడు పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ

పాల్గొననున్న మంత్రులు సబిత, శ్రీనివాస్‌గౌడ్



కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిరాటి సిద్దుగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక సంఘం నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సబితారెడ్డిలు రానున్నారని వెల్లడించారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి గౌడలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అనేగొని అంజయ్యగౌడ్, పల్లె యాదయ్యగౌడ్, అనేగొని అశోక్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, దేవేందర్‌గౌడ్, యాదయ్యగౌడ్, జంగయ్యగౌడ్, పండుగౌడ్, రవీందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్, రాజుగౌడ్, కృష్ణగౌడ్, శివగౌడ్, దిలీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్



సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్‌రావ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావ్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆమనగల్లు వరకు మెట్రోను పొడగించాలని సీఎం కేసీఆర్‌ను జైపాల్‌యాదవ్ కోరారని తెలిపారు. కేసీఆర్ సహకారంతో ఆమనగల్లుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల మంజూరయ్యాయని తెలిపారు. రూ.4.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.2.5 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.1.5 కోట్లతో ప్రభుత్వ గ్రంథాలయం నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలో వివిధ ప్రభుత్వ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే కోర్టు, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం వచ్చాయని ఆయన చెప్పారు.

స్నేహమేరా జీవితం..

- ఆపదలో ఆదుకున్న వాడే నిజమైన మిత్రుడు
- 'స్నేహమేవ జయతే' వ్యవస్థాపక సభ్యులు

నిజాయితీ, నిస్వార్థం ఉన్న స్నేహమే కలకాలం నిలుస్తుంది. ఆ మాధుర్యాన్ని చవిచూసిన 'స్నేహబృందం'.. మానవతా విలువలు మరిచిపోతున్న నేటి తరంలో నింపాలనే తపనతో చిరు ప్రయత్నం చేస్తోంది. నగేష్ ఆలోచనల నుంచి చిగురించిన స్నేహహస్తం 'స్నేహమేవ జయతే'. ఈ సంస్థ ఎందరికో మంచిని పంచుతోంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కథనం



మూడున్నర దశాబ్దాల మిత్రబృందం

హుడాకాంప్లెక్స్: అది 2008 సంవత్సరం. ప్రపంచ స్నేహితుల దినోత్సవం రోజున సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీకి చెందిన నగేష్ రంగి 'స్నేహమేవ జయతే' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. మొదట నలుగురితో ప్రారంభమైన సంస్థ ప్రస్తుతం.. 370 మంది సభ్యులతో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. యేటా ఆగస్టు నెల మొదటి ఆదివారం నిర్వహించుకునే ప్రపంచ స్నేహితుల దినోత్సవం రోజున స్నేహితులందరూ ఒక చోట కలుస్తారు.

సేవా కార్యక్రమాలు..

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ. స్నేహం విలువలను తెలియజేస్తూ కరపత్రాలు పంచడం. అవయవదానం, రక్తదానం వంటి అంశాలపై సమావేశాల నిర్వహణ. పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, పాలిథిన్ బ్యాగుల నిషేధంపై విస్తృత స్థాయి ప్రచారం. రోడ్లపై తొలగించిన కేబుల్ వైర్లు, ఖాళీ సీసాలను తొలగించడం. నిజాయితీ మీటర్ రీడింగ్ చూపాలని ఆటో డ్రైవర్లకు అవగాహన. స్వచ్ఛంద సంస్థ సహకారంతో వైద్య శిబిరాల నిర్వహణ. అనాథ శరణాలయాల్లో అన్నదానాలు, పండ్ల పంపిణీ. జాతినేతల గొప్పదనంపై కరపత్రాల ద్వారా ప్రచారం. రాఖీ రోజున ఫ్రెండ్‌షిప్ బాండ్ల పంపిణీ.

స్నేహమే జీవితం..



స్నేహమే జీవితం.. స్నేహమే శాశ్వతం. స్నేహంలో రాగద్వేశాలకు తావుండదు. చిన్నా, పెద్ద తేడా ఉండదు. అసూయ అసలు అసలే ఉండదు. స్నేహితులు ఉన్నత స్థాయిలో ఉంటే గర్విస్తాం. కష్టాల్లో ఉన్న మిత్రులను ఆదుకున్నప్పుడే నిజమైన స్నేహితులెవరో తెలుస్తుంది.

– నగేష్ రంగి, సంస్థ వ్యవస్థాపకుడు

మిత్రులు కలిస్తే బాధలన్నీ మాయం



నా బాల్య మిత్రులు జగన్మోహన్‌రెడ్డి, నగేశ్‌రంగి, మనోహర్‌లు స్నేహంలోని మాధుర్యాన్ని రుచి చూపించారు. మా నలుగురి ఆలోచనల నుంచి పుట్టిందే స్నేహమేవ జయతే. స్నేహితులు కలిసినప్పుడు మనసులోని బాధలన్నీ తొలగి ఆనందంగా ఉంటుంది.

– రాందేశ్‌పాండే, సంస్థ వ్యవస్థాపకుడు

పేదల పాలిట వరం 'సీఎంఆర్‌ఎఫ్'

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- పర్మినెంట్ చేయాలంటూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి



బడంగ్‌పేట్: బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: 'పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తుంది' అని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. అల్మాస్‌గూడకు చెందిన ఫాతిమా, ఎస్.శశికాంత్, ఎం.వేణుగోపాల్‌రెడ్డిలు అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, యువ నాయకుడు రోహిత్‌రెడ్డి మంత్రి సబితారెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి.. సీఎం సహాయనిధి కింద శనివారం ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల చొప్పున మొత్తం రూ.7.5 లక్షల ఎల్‌వోసీని మంజూరి చేయించారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు మంత్రి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లు అరుణ్‌జ్యోతి, గీత తదితరులు ఉన్నారు.

క్రమబద్ధీకరించాలి..

తుక్కుగూడ: తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పురపాలక సంఘాల్లో వివిధ కేటగిరీల్లో పని చేస్తున్న తమను ప్రభుత్వం స్పందించి..రెగ్యులర్ చేయాలన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

రావిర్యాల చెరువు సుందరీకరణకు రూ.6 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయించిన మంత్రి సబితారెడ్డికి పుర ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో చెరువు కట్ట అభివృద్ధితో పాటు, దాని రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని పేర్కొన్నారు.

ఉద్యోగుల వినతి

మీర్‌పేట: మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ మీర్‌పేట, బడంగ్‌పేట, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ ఉద్యోగులు మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

మీర్‌పేట: తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని మీర్‌పేట కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ అన్నారు. శనివారం జిల్లెలగూడ సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే ముర్రు పాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు గంగమ్మ, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, పుష్పమ్మ, ఆయా జంగమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అనేక ప్రయోజనాలు

కందుకూరు: తల్లి పాలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని.. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలను తప్పక పట్టించాలని ఆకులమైలారం సర్పంచ్ కలమ్మ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఆకులమైలారంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా లాంటిదన్నారు. తల్లులు రెండేళ్ల వరకు తమ పిల్లలకు ఇతర ఆహారంతో పాటు తల్లి పాలను పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు యు.వనజ, జి.పుష్పలత, బి.లక్ష్మి, ఎం.సంతోష తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: ఆకులమైలారంలో తల్లిపాల వారోత్సవాలు



మీర్‌పేట: వారోత్సవాల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్

అక్రమ డ్రైనేజీ నిర్మాణాన్ని అడ్డుకోండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బైరాగిగూడ వాసులు

కందుకూరు: ఓ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు అక్రమంగా డ్రైనేజ్, వర్షం నీటిని తమ గ్రామం వైపు వెళ్లేలా డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బైరాగిగూడ వాసులు శనివారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో కలిసి ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. కందుకూరు మండలం బైరాగిగూడ, లేమూరు, గూడూరు రెవెన్యూతో పాటు మహేశ్వరం మండలం తుమ్మలూరు రెవెన్యూ పరిధిలో గ్రీన్ రిచ్ రియల్ ఎస్టేట్ సంస్థ 500 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అందులో నుంచి వచ్చే మురుగు నీటితో పాటు వర్షం నీటిని బైరాగిగూడ గ్రామం వైపు మళ్లించేలా డ్రైనేజ్ నిర్మాణాన్ని చేపట్టారన్నారు. పంచాయతీ నుంచి నోటీసులు పంపించడానికి ప్రయత్నించినా తీసుకోవడం లేదని చెప్పారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఇందులో వార్డు సభ్యులు నరేందర్, యాచారం మైసయ్య, ఇక్బాల్‌బేగం, పల్స అనిత, గుల్వి పరమేశ్వరి పండల మౌనిక, పండల మైసయ్య, నాయకులు మహ్మద్ దావూద్, ఎండీ సర్వర్, పల్స శివప్రసాద్, ఏనుగుల జంగయ్య, పి.యాదగిరి, పి.సత్యనారాయణ, సయ్యద్ ఇమ్రాన్, మంచాల అజయ్, యాచారం సందీప్, జి.ప్రవీణ్ ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

తలకొండపల్లి: లోక్‌సభ సభ్యత్వం కోల్పోవడానికి కారణమైన 2019 నాటి పరువునష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రెండేళ్లపాటు శిక్ష విధిస్తూ గుజరాత్‌లోని సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో అత్యున్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ అజీం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాహుల్‌పై బీజేపీ నేతలు చేసిన కుట్రలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఆయన నివాసాన్ని ఖాళీ చేయించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామం సర్వే నంబర్ 90లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ చంద్రకళకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ 90 సర్వే నంబర్‌లో 10 ఎకరాల 37 గుంటల ప్రభుత్వ భూమిలో పల్లె ప్రకృతి వనం, గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలని కోరారు. సీపీఎం మండల నాయకులు జగన్, లింగస్వామి, బుగ్గరాములు, రమేశ్, జంగయ్య ఉన్నారు.



తహసీల్దార్ చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఫార్మాసిటీపై కోర్టు తీర్పు హర్షణీయం

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

యాచారం: ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్నారని, అయినా అధికారులు భూసేకరణ చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. భూసేకరణను అడ్డుకున్న రైతులపై కేసులు పెట్టారని మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫార్మాసిటీ వస్తే ఈ ప్రాంతం కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లను హైకోర్టు రద్దు చేయడం హర్షణీయమన్నారు. రైతులకు మద్దతుగా సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహ, అంజయ్య, దంతుక పెద్దయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోనే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ చంద్రకళకు బీఎస్పీ, స్వేరో నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు చెరుకూరి రాజు మాట్లాడుతూ ఇక్కడ ఉండాల్సిన మహిళా డిగ్రీ గురుకుల కళాశాల ఘట్‌కేసర్‌లో అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. కళాశాల నిర్మాణానికి 2016లో ఇబ్రహీంపట్నం సమీపంలో 7 ఎకరాల స్థలాన్ని కేటాయించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు భవన నిర్మాణం జరుగలేదన్నారు. ప్రభుత్వం వెంటనే భవనాన్ని నిర్మించి మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను ఇక్కడికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్‌కుమార్, భరత్ రాజ్, అభిలాష్, రాజేష్‌చౌహాన్, అనిల్, చిరంజీవి, ప్రవీణ్, అనీష్, మనికంఠలు పాల్గొన్నారు.